ప్రజాశక్తి

ఆదివారం 16 ఏప్రిల్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



కలెక్టర్ రంజిత్ బాషాకు అభినందనలు తెలుపుతున్న జేసీ

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రజింత్ బాషాను ఎస్‌పి వకుల్ జిందాల్, సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా స్థితిగతులు, పురోభివృద్ధిపై కలెక్టర్ చర్చించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలను అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళ్లడానికి అధికారుల సమన్వయం, సహకారం అవసరమని తెలిపారు.

జేసీగా చామకూరి శ్రీధర్

బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారుల జేసీ ఘన స్వాగతం పలికారు. తొలుత జేసీ భావన్నారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాటప్ల జిల్లాగా ఏర్పడిన బాపట్లకు రెండో జేసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు జేసీకి అభినందనలు తెలిపారు.

రోడ్లు చిమ్మడానికి పట్టభద్రులు..!

- ఒఎంసి పాలకుల వింత పోకడ
- కోవిడ్ కార్మికుల భర్తీ పేరుతో అడ్డగోలు నియామకానికి రంగం సిద్ధం
- చిమ్మే పేరుతో పనిలో పెట్టుకొని ఆపైన కార్మికులపై పెత్తనం చేసే బాధ్యతలు
- నిరుద్యోగాన్ని 'క్యాష్' చేసుకునే పనిలో నేతలు



ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థలో రోడ్లు చిమ్మడం, కాలువలు తీయడం, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే పనిని ఇప్పటి వరకు చదువు లేనివారు, అరకొర చదువుకున్నవారు, పేద దళిత, గిరిజనులు చేస్తున్నారు. ఇకమీదట కొంతమంది పట్టభద్రులను కూడా ఈపనిలో నియమించుకోవడానికి నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం సిద్ధమవుతోంది. పని పేరుకు రోడ్లుచిమ్మేదే అయినా తరువాత వారిలో అత్యధికులను పనిచేసే కార్మికులపై పెత్తనం చేసేవారిగా నియమించే యోచనలో ఉన్నారు. ఈపరిణామం ఓ వైపు నగరంలో నిరుద్యోగ సమస్యను ఎత్తుచూపుతుంటే, మరో వైపు నేతలకు ఆదాయ వనరుగా కనిపిస్తోంది.

కోవిడ్ కార్మికుల పెంపు పేరుతో....

కోవిడ్ సమయంలో నగరంలో పారిశుధ్య పనులు చేసేందుకు కార్మికులను పెంచాలనే తలంపుతో అప్పటి అధికారులు మొదట్లో 50 మంది కార్మికులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వారి సంఖ్య 75కి చేరింది. ప్రతి మూడు, ఆరు నెలకు ఒకసారి వారి టెండర్‌ను పొడగిస్తూ వారిచేత పనులు చేయిస్తున్నారు. తాజాగా ఈనెల నుంచి కూడా వారి టెండర్‌ను పొడిగించారు. ఈసారి టెండర్‌లో కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని ప్రతిపాదించారు. ఆప్రతిపాదనలను వారం రోజుల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో పెట్టి ఆమోదించుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ టెండర్‌లో కార్మికుల సంఖ్యను 150కి పెంచనున్నారు. ఈ పాటికే పనిచేస్తున్న కోవిడ్ కార్మికుల సంఖ్యకు ఇది రెట్టింపు. పెరిగిన నగర విస్తీర్ణం, జనాభాకు అనుగునంగా కార్మికుల సంఖ్యను పెంచడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. అయితే ఎవరిని పడితే వారిని విధుల్లోకి తీసుకోవడం వల్ల నగరపాలక సంస్థ చేకూరే లాభం కంటే నష్టమేఅధికం అనే విమర్శలు

▶ 2లో

నేత్ర పర్వంగా చెన్నకేశవుని రథోత్సవం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆకర్షణీయ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, ఇతర పండితుల వేద మంత్రాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచారు. రథం బజారు నుంచి మొదలుకుని నాలుగు మాడ వీధుల్లో స్వామివారి ఉత్సవం జన సందోహం మధ్య సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా జనం



జన సందోహం నడుమ చెన్నకేశవుని రథోత్సవం



రథోత్సవంలో మంత్రి డాక్టర్ సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

తరలిరావడంతో మార్కారం పట్టణంలో ప్రధాన వీధులన్నీ జనంతో కిక్కిరిసాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, కందుల నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ కిశోర్‌కుమార్ సారధ్యంలో సిఐ ఎం.భీమానాయక్ పర్యవేక్షణలో మార్కాపురం పట్టణ ఎస్ఐ శశికుమార్, రూరల్ ఎస్ఐ సుమన్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్య నిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై మళ్లీ ఆందోళన

- ఇప్పటికే రిమ్స్‌లో ఇద్దరు రోగులకు వైద్యం
- పెరుగుతున్న జ్వరాలు
- తగ్గిన జాగ్రత్తలు



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మళ్లీ కోవిడ్ కేసులు దేశంలో కనిపించడంతో వైద్యశాఖను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. కోవిడ్‌పై అప్రమత్తంగానే ఉండాలని వైద్యశాఖకు ఆదేశాలు వచ్చాయి. దీంతో రిమ్స్‌లో అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు. జిల్లాలో ఇప్పటికే ఇద్దరికి పాజిటివ్ రావడంతో వారిని రిమ్స్‌లో చేర్పించారు. వైద్యం అందిస్తున్నారు.మందులు, బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్లు సిద్ధం చేస్తున్నారు. కోవిడ్ రెండో దశలో చాలా మంది చనిపోయారు. రానురాను దాని తీవ్రత తగ్గింది. మూడోదశ కూడా వెళ్లిపోయింది. అంతగా కేసులు రాలేదు.వచ్చినా జనం కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఇళ్ల వద్దనే వైద్యం తీసుకుని తగ్గించుకున్నారు. మరణాలు కూడా లేవనే చెప్పాలి. ఇపుడు మళ్లీ కేసులు కనిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల సమయం కూడా దాటిపోయింది. వర్షాలు కురిశాక సాధారణంగా సీజనల్ వ్యాధులు వచ్చేవి. అయితే ఇపుడు జనవరి నుంచి జ్వరాలు తగ్గడం లేదు. వైరల్ ఫీవర్లు అని చెబుతున్నారు. పది రోజులుపాటు జ్వరాల బారిన పడుతున్నారు. జలుబులు, దగ్గువంటి సమస్యలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. పరీక్షలు పెద్దగా చేయించుకోవడం లేదు. ఎందుకంటే కోవిడ్‌పై ఇపుడు పెద్దగా చర్చలేదు. పరీక్షలు లేనందున రోజువారీగా నమోదయ్యే కేసులు కూడా తెలియడం లేదు. ఇక కోవిడ్‌పై ఇపుడు పెద్దగా చర్చలేదు.దాన్ని ఏడాది నుంచి మరిచిపోయారు. జాగత్తలు లేకుండా పోయాయి. మాస్కులు లేవు. శానిటైజర్లు కనిపించడం లేదు. జాగత్తలు తగ్గడమే ఆందోళన కలిగిస్తోంది. ఏదేమైనా కోవిడ్ కేసులు కనిపిస్తున్నందున జనం జాగత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

రోడ్డు చిమ్మడానికి పట్టభద్రులు ..!

(మొదటి పేజీతరువాయి)

(మొదటి పేజీతరువాయి)

వినిపిస్తున్నాయి.

90 శాతం మంది విద్యావంతులే..

ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఇప్పుడున్న కోవిడ్ కార్మికుల సంఖ్యను పెంచాలని తీర్మానించారు. ఎంతమందిని పెంచాలనే స్పష్టత ఇవ్వలేదు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో తమకు పనిని కేటాయించాలంటూ ఇటీవల నగరపాలక సంస్థకు 92 దరఖాస్తులు అందాయి. అంతకు మునుపు మరో 30 వరకు దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వెరసి సుమారు 120 మంది పారిశుధ్య విభాగంలో తమకు పని కల్పించండి అంటూ దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికులు విద్యావంతులే. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారు కూడా ఉన్నారు. కేవలం పది శాతం మంది మాత్రమే అరకొర చదువుకున్నవారు, చదువులేనివారు ఉన్నారు. ఇంత చదువు చదువుకున్న వారిని విధుల్లోకి తీసుకొని వారిచేత రోడ్లు చిమ్మించడం, కాలువలు తీయించడం, చెత్త సేకరణ పనులు చేయించడం సాధ్యమేనా.? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

అంతా కలిపి వెయ్యి మంది

ఒంగోలు నగరపాలక సంస్థలో ఈపాటికే 681మంది పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరందరిని ప్రభుత్వం ఆప్కాస్‌లో కలిపింది. మరో 95మంది రెగ్యులర్ కార్మికులు (ప్రభుత్వ ఉద్యోగులైన కార్మికులు) ఉన్నారు. కోవిడ్ కార్మికులు 75మంది పనిచేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు మొత్తం 851 మంది. వీరిలో సుమారు 70 మంది కార్మికులు పారిశుధ్య కార్మికుల పనిని పర్యవేక్షించే మేస్త్రీలుగా ఉన్నారు. సచివాలయ పారిశుధ్య పర్యవేక్షకులుగా పనిచేసే ఉద్యోగులు మరో 70మంది ఉన్నారు. అంతా కలిపి పారిశుధ్య విభాగంలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సంఖ్య 921 మంది. ఇప్పుడు తాజా ప్రతిపాదనల ప్రకారం కోవిడ్ కార్మికుల టెండర్‌లో మరో 75మందిని విధుల్లోకి తీసు కుంటే ఆసంఖ్య కాస్త 1000కి చేరుతోంది.

పని కంటే పెత్తనం చేసే వారే అధికం

ప్రస్తుతం 800 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తుంటే వారి పనిని సుమారు 150 మంది పర్యవేక్షిస్తున్నారు. సగటున ప్రతి పది మందికి ఒక పర్యవేక్షకుడు ఉన్నారు. దీనిపై ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయి. ప్రతి 50మంది కార్మికులకు ఒక పర్యవేక్షకుడిని ఏర్పాటు చేస్తు సరిపోతుంది. లేదంటే ప్రస్తుతం ప్రతి సచివాలయం పరిధిలో ఒక శానిటరీ సెక్రటరీ ఉన్నాడు కాబట్టి వారిని పర్యవేక్షకులుగా పెడితే సరిపోతుందనే సూచనలు ఉన్నాయి. అధికారులు, నేతలు వీటిని పరిగణలోకి తీసుకోవడం లేదు. పర్యావసానంగా కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో పనిచేసేవారికంటే పెత్తనం చేసే వారే అధికంగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే సిఫార్సులే అధికం...

కోవిడ్ కార్మికుల టెండర్‌లో మరికొంతమంది పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవడానికి కౌన్సిల్ ఆమోదం తెలపక ముందే ఎవరిని విధుల్లోకి తీసుకోవాలనే జాబితా కార్పొరేషన్ పాలకవర్గం సిద్ధం చేసినట్లు సమాచారం. కార్పొరేషన్‌లో దాదాపు 130 వరకు దరఖాస్తులు ఉండగా అందులో సింహభాగం స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సిఫార్సు చేసినవే కావడం విశేషం. ఆయన చేసిన సిఫార్సుల్లో ఎక్కువమంది చదువుకున్న వారు ఉండటంతో వారిని పనిలోకి తీసుకొని వారి చేత 'చెత్త' పనులు చేయిస్తారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ముందు పారిశుధ్య కార్మికుల పేరుతో పనిలోకి తీసుకొని తరువాత వారిలో ఎక్కువ మందిని పర్యవేక్షకులుగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చౌక్కా నలగని పని కావడంతో ఈ నియామకాలకు డిమాండ్ పెరిగింది. పారిశుధ్య ఉద్యోగాల పేర కార్పొరేషన్‌లో కొంతమంది కీలక నేతలు, అధికారులు వసూళ్లకు తెరతీశారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

భారతమ్మకు నివాళి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు: మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో టిడిపి నాయకులు నెప్పల శివకృష్ణ తల్లి భారతమ్మ పెద్దకర్మ సందర్భంగా శనివారం ఆమె చిత్రపటానికి సంతనూతలపాడు మాజీ ఎంఎల్‌ఏ టీడీపీ ఇన్‌ఛార్జి బిఎన్ విజయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

స్థల వివాదమే కారణం: ఒంగోలు డిఎస్‌పి యు నాగరాజు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో సంచలనం సష్టించిన ఓ వ్యక్తిపై హత్యాయత్నం కేసును పోలీసులు చేధించినట్లు ఒంగోలు డిఎప్‌పి యు. నాగరాజు తెలిపారు. శింగరాయకొండ సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... కె. బిట్రగుంట గ్రామానికి చెందిన పెరుగు నాగేశ్వరరావును అదే గ్రామానికి కుంచాల ఉమామ హేశ్వరరావు, మరో ముగ్గురితో కలిసి బుధవారం రాత్రి హత్యచేసేందుకు పథకం రచించారు. అందులో భాగంగా బిట్రగుంట వద్ద భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన ఉన్న గ్రావెల్ రోడ్‌లోకి పెరుగు నాగేశ్వరరావు తీసుకెళ్లారు. నాగేశ్వరరావుపై దాడి చేశారు. తరువాత ప్లాస్టిక్ తాడుతో గొంతుకు బిగించి లాగుతుండగా మరొక వ్యక్తి కదలకుండా కాళ్లు పట్టుకున్నాడు. నాగేశ్వరరావు గట్టిగా కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చారు. దీంతో నిందితులు పరారీ అయ్యారు. నాగేశ్వరరావు ంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడి నుంచి



కేసు వివరాలు చెబుతున్న డిఎస్‌పి నాగరాజు

జరుగుమల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు సేకరించారు. పెరుగు నాగేశ్వరరావుకు కుంచాల ఉమా మహేశ్వరరావు మధ్య గత తొమ్మిది సంవత్సరాల నుంచి స్థల వివాదం ఉంది.ఈ నేపథ్యంలో గతంలో ఇద్దరి మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగు నాగేశ్వరరావును చంపేందుకు కుంచాల ఉమా మహేశ్వరరావు పథకాలు వేస్తున్నాడు. అందులో భాగంగా ఉమామహేశ్వరరావు శింగరాయకొండ పకీర్ పాలెంకు చెందిన రామలింగం వెంకటేశ్వరరావు, కె.బిట్రగుంటకు చెందిన దేపూరి పవన్ కుమార్, ఓ మైనర్ బాలుడి కలిసి పెరుగు నాగేశ్వరరావును చంపాలని నిర్ణయించుకున్నాడు. ముగ్గురికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇచ్చేలా సఫారీ మాట్లా డుకున్నాడు.పథకం ప్రకారం పొలాల వద్ద పెరుగు నాగేశ్వర రావును హత్య చేసి కారు, బైకులపై పరారీ అయ్యేందుకు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆవులకు మేత వేసేందుకు వచ్చిన నాగేశ్వరరావును హతమార్చేందుకు ప్రయత్నించగా బాధితుడు పెద్ద పెద్దగా కేకలు వేశాడు. కేకలు విని చుట్టుప్రక్కల వారు అక్కడికి రావడంతో నిందితులు పరారీ అయ్యారు. నిందితులను జివిఆర్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. హత్యాయ్నతం కేసును చేధించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందినట్లు డిఎస్‌పి తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిఐ దాచేపల్లి రంగనాథ్ జరుగుమల్లి ఎస్‌ఐ వెంకటేశ్వరావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సర్పంచుల ఆగ్రహం

ప్రజాశక్తి-మద్దిపాడు

గ్రామ సచివాలయంలోని ఎనర్జీ అసిస్టెంట్ తమ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని సర్పంచులు ట్రాన్స్‌కో ఏఇ ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశం హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. మండలంలోని వివిధ శాఖల సమీక్షలో ముందుగా పశు సంవర్ధక శాఖలో ప్రభుత్వ పథకాలు ప్రజా నాయకులకు తెలియపరచడం లేదని ఎంపిపికి ఫిర్యాదు చేశారు. దొడ్డవరం సర్పంచ్ పూనూరు సుబ్బారావు, సీతారామపురం సర్పంచ్ శివనందరావు, మద్దిపాడు సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, మల్లవరం సర్పంచ్ సుబ్బారెడ్డి తదితరులు ట్రాన్స్‌కో ఏఇ రవి ప్రకాష్, గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఇ మహేంద్రరెడ్డిలపై ప్రశ్నల వర్షం కురిపించారు. మద్దిపాడు సర్పంచ్ మాట్లాడుతూ రక్షిత మంచినీరు మోటార్ల కొనుగోలుకు తన సొంత నిధులు ఖర్చు చేశానని, వాటికి ఎంబుక్‌లు రాసి పంపి ఆరు నెలలు అయినా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదని అగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలోని ఎనర్జి అసిస్టెంట్ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని సీతారామపురం సర్పంచ్ తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఆటంకాలు వస్తున్నాయన్నారు, వేసవి కాలంలో నీటి సరఫరాకు, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని స్థానిక శాసనసభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

టీజెఆర్ సుధాకర్‌బాబు సంబంధిత మండల అధికారులను ఆదేశించారు. కొలచనకోటలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని గ్రామ సర్పంచ్ తెలిపారు. సచివాలయంలో ఎవరూ పనిచేయక పోయినా పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వై శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనలు పునరావృతం కారాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ఎంపీపీ వాకా అరుణ అధ్యక్ష తన జరిగింది. కార్యక్రమంలో తహశీల్దారు జి రజనికుమారి, ఆర్ఐ కొప్పోలు అనూష, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బెజవాడ రాము, మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 9 గంటలకు రావినూతల గ్రామంలో ఆర్‌ఎస్‌సిఏ స్టేడియంలో జరగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికయిన జట్లు 21వ తేదీ కృష్ణా జిల్లా, మూలపాడు క్రికెట్ గ్రౌండ్లో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ జిల్లాల పోటీలలో టి20, వన్ డే పోటీలలో పాల్గొంటారు. పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రెస్, షూస్, కిట్లతో, తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి గలవారు 9849529919, 9573424360 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉప్పుగుండూరులో 'జగనన్నే మాభవిష్యత్'

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో శనివారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు టిజెఆర్ సుధాకర్‌బాబు ప్రారంభించారు. ఇంటింటికీ జగన్ స్టిక్కర్ అంటించి ప్రభత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి వివరించారు ప్రభుత్వ పనితీరుపై ఏ విధంగా ఉందని ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తొలుత గ్రామ వైసిపి నాయకులు బండారు సురేష్ కుమారుడు జయప్రకాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడంతో జయప్రకాష్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అనారోగ్యంతో ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్న ఎంపిటిసి-2 మున్నంగి వెంకట్రావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ జయమ్మ, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పి శ్రీమన్నారాయణ, జెసిఎస్ మండల కన్వీనర్ కుమ్మారి సుధాకర్, యర్రా దశరథ, లింగంగుంట బాబు, బత్తుల ప్రసన్న, సొసైటీ అధ్యక్షులు ఉప్పుగుండూరు శ్రీనివాసప్రసాద్, వైస్ సర్పంచ్ పి శ్రీను, ఎంపీటీసీ అనురాధ,



జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్న ప్రజలు

గ్రామ పార్టీ అధ్యక్షులు మాదాసు రాంబాబు, సచివాలయ కన్వీనర్, కొంజేటి సురేష్‌బాబు, పక్కేల వజ్రం బాబు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ కొలకలూరి విజయ్ కుమార్, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పెంట్యాల.జ్యోతి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు దానియేలు, పి ప్రవీణ్, యంద్రపాటి చంద్రశేఖర్, చెన్నుపాటి వెంకట్రావు, అంజిబాబు, రాపర్ల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగి ఒకరు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వెలుగుచూసింది. 1వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలెక్టరేట్‌లోని డిఇఓ కార్యాలయంలో అటెండర్‌గా వోరుగొండ నందసాయి(32) నగరంలోని గానుకపాలెంలో నివాసముంటాడు. ఇతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. తల్లి ఉపాధ్యాయినిగా పనిచేస్తూ మరణించడంతో సాయికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. సాయి ఆత్మహత్యకు కారణాలు తెలియవలసి ఉంది. సాయి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

మోపెడ్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమల్ల వద్ద మోటార్ బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కందుకూరు డిపోకు చెందిన నాన్ స్టాప్ బస్సు ఒంగోలు నుంచి కందుకూరుకు వెళుతుండగా చిన్న కనుమల్ల వద్ద ఆ గ్రామానికి చెందిన చొప్పర బాలకోటయ్య(75)అనే వ్యక్తిని ఢీకొట్టింది. కనుమల్ల నుంచి శింగరాయకొండకు వస్తున్న ఈయన టీవీఎస్ 50 మోటార్ బైక్‌పై వస్తుండగా బస్సు ముందువైపున బైకును ఢీకొట్టింది. బైక్ మీద ఉన్న బాలకోటయ్య అనే వ్యక్తికి గాయాలు కావడంతో ఒంగోలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని ఎస్ఐ ఫిరోజా ఫాతిమా తెలిపారు. ప్రమాదం జరిగిన చిన్నకనుమల్ల వద్దకు వెళ్లి పోలీసులు పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు కూడా అక్కడకు చేరుకొని బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సు ద్వారా గమ్యస్థానాలకు చేర్చారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన బాలకోటయ్య

అదుపు తప్పిన ట్రావెల్స్ బస్సు

9 మందికి గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని తూర్పు నాయుడుపాలెం సమీపంలో ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి రహదారి పక్కన పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం జరిగింది. హైదరాబాదు నుంచి నెల్లూరు జిల్లా కందుకూరు వెళుతున్న రమేష్ ట్రావెల్స్ బస్సు టంగుటూరు మండలం ఐఓసీ సమీపంలో గల తూర్పునాయుడుపాలెం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 9 మందికి గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న టంగుటూరు హైవే పోలీసులు క్రేన్ సాయంతో బస్సును పక్కకు తీశారు. క్షతగాత్రులైన ప్రయాణికులను బయటకు తీసి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని ఆరవపల్లి గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు సర్పంచ్ లోయబాబు నాంచారయ్య తెలిపారు. పశువులకు గర్భకోశ వ్యాధి మందులు, ఎముకల పొడి, టానిక్‌లు ఉచితంగా అందజేశారు. పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పశువులు ఈనిన వెంటనే బలమైన ఆహారం పెట్టాకుండా మూఢనమ్మకాలతో ఎండుగడ్డి, పచ్చిగడ్డి పెడితే పశువులు బలహీనపడతాయన్నారు. సమీకృత దాణ, ఖనిజ లవణ మిశ్రమాన్ని పెట్టాలన్నారు. మొత్తం 330 గేదెలు, దూడలకు, 25 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వాక్సినేషన్ వేసిన పశువులను మేతకు బయటకు వదలకుండా ఒక రెండు రోజులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లోయబాబు

వ్యక్తి బెదిరింపులపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

తనపై దాడి చేయడమే కాకుండా చంపుతానని ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని ఓ మహిళ 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండవీటి శివపార్వతి కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంటారు. ఆమెకు 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య ఉన్న మనస్పర్థల నేపథ్యంలో వారికి గత ఏడాది చట్టపరంగా విడాకులు మంజూరయ్యాయి. అయితే ఆమెకు 3 సంవత్సరాల క్రితం ఉస్మాన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మూడు సంవత్సరాలుగా ఉస్మాన్ వారి ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత 8 నెలలుగా ఆమెపై అనుమానం పెంచుకుని ఆమెను వెంబడిస్తూ, ఆమె ఫోన్‌ను తీసుకుని తనకు కాల్ చేసిన వారికి ఫోన్ చేసి అవమానపరచడం వంటి చర్యలకు పాల్పడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తనపై దాడి చేశాడన్నారు. మరోసారి తనపై దాడి చేసి గొంతు పిసికే ప్రయత్నం చేయగా పెద్దగా కేకలు వేయడంతో తన పిల్లలు రావడంతో వెళ్లాడని, వెళుతూ వెళుతూ తనను చంపుతానని బెరించాడని పేర్కొన్నారు. తనకు, తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్లేట్లు అందజేస్తున్న దృశ్యం

హాస్టల్ విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-రేపల్లె

పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులకు 200 భోజన ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా ఫారెస్ట్ అధికారి బి విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలలు సాకారం చేసుకొని ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసిటిఓ అధికారి జి సురేష్, డాక్టర్ వసంతరావు, అధ్యక్షులు విజయ్‌కుమార్, హనోక్, పి బాలాజీ, రాజారత్నం, పెనుమాల సుబ్బారావు, రమేష్ రాంజీ, మునిపల్లి సుబ్బయ్య, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మంచిపేరు తెచ్చేలా బోధించండి: ప్రిన్సిపల్ సెక్రటరీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే విధంగా, ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వేములకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. ఆయన వెంట ఆర్‌జెడి సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, డిప్యూటీ డిఇఓ చంద్రమౌళేశ్వరరావు ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ నేరుగా పాఠశాల గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వాళ్లకు బోధించారు. ఆయన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం ఇవ్వడంతో సంతప్తి వ్యక్తం చేశారు. బోధన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అలా ఎవరైనా వ్యవహరిస్తే తప్పక షోకాజ్ నోటీసులు అందజేయాలని ఆర్‌జెడికి సూచించారు. పాఠశాలలో ఉన్న ఆయాలు, మధ్యాహ్న భోజనం వడ్డించే కుక్‌లతో మాట్లాడుతూ మీ జీతం ఎంత అని ప్రశ్నించారు. రూ.6 వేలు అంటూ ఆయా సమాధానం ఇవ్వగా జీతం సక్రమంగా అందుతోందా అని ప్రశ్నించారు. డిసెంబర్ వరకే జీతాలు ఇచ్చారని, నాలుగు నెలల బకాయిలు ఉన్నాయని చెప్పడంతో ఎందుకు జీతాలు ఇవ్వలేదని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. సీఎఫ్ఎంఎస్ కారణంగా జీతాలు ఆలస్యం అయ్యాయని సమాధానం రావడంతో సిబ్బందిపై మండిపడ్డారు. నాకు ప్రతీ నెలా సక్రమంగా అందుతున్నప్పుడు కింది సిబ్బందికి ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.? వచ్చే నెల నుంచి ఆయాలకు, కుక్‌లకు జీతాలు ఇచ్చిన తరువాతే ఎవరికైనా జీతాలు మంజూరు కావాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.180 కోట్లు జీతాలుగా ప్రభుత్వం ఇస్తుంటే కొంతమంది జీతాలు తీసుకుని న్యాయం చేయకపోవడం తగదన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సక్రమంగా వాడుతున్నదీ లేనిదీ పరిశీలించారు. మనబడి నాడు-నేడు పథకంలో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నట్టు కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బీ రాందాస్ నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ తిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాలలోప్రవీణ్ ప్రకాశ్


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి వి రామకృష్ణ

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి-చీరాల: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల అగ్నిమాపక కేంద్రం అధికారి వి రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎంజీసీ మార్కెట్ గడియారస్తంభం కూడలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పాయింట్ల ఓవర్ లోడ్ వేయరాదని, ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్లినప్పుడు కరెంటు మెయిన్ను తప్పనిసరిగా ఆపివేయాలని తెలిపారు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలను ఆర్పివేసి పడేయాలని సూచించారు. ఎలక్ట్రిక్టల్ ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పివేసేందుకు కొంత నీటిని ఇంట్లో ఉంచుకోవాలన్నారు. మీ దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా నేలపై దొర్లడం కానీ లేక దుప్పటి, ఇతర వస్త్రాలను చుట్టుకోవాలని చెప్పారు. గడ్డివాములు నివాసాలకు దూరంగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, ప్రధాన రహదారుల్లో అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా నివారించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


చెరుకూరు వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి కుముదిని

వసతి గృహాన్ని తనిఖీ చేసిన జడ్జి

ప్రజాశక్తి-పర్చూరు

వసతి గృహాల్లో మెను తప్పనిసరిగా పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం కుముదిని ఆదేశించారు. పర్చూరు మండలం చెరుకూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆమె సందర్శించారు. బాలురు ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. వసతి గృహంలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఆహార పదార్థాలను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి విద్యార్థిని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్జి వెంట కోర్టు సిబ్బంది, సంక్షేమ అధికారి ఉన్నారు.

మెప్మా ఇన్‌ఛార్జి పిడీగా వెంకట నారాయణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా మెప్మా ఇన్‌ఛార్జి పిడీగా పి వెంకట నారాయణను నియమిస్తూ ఎండీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అబ్దుల్ ఖాదర్‌ను పిడీగా నియమించగా ఆయన బాధ్యతలు చేపట్టకపోవడంతో వెంకట నారాయణను నియమించారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఇంజినీరింగ్ కాలేజీలో 'ఆల్ఫా' వేడుకలు

ప్రజాశక్తి-వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో ఎంబిఎ, ఎంసిఎ చదువుతున్న విద్యార్థులకు అల్ఫా ఎం వేడుకలను నిర్వహించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మోయిద వేణుగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ శక్తియుక్తులను సరియైన రీతిలో ఉపయోగించుకొని తమ విలువను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఆధునిక యువత చేయలేనిది ఏమీ లేదని, అందుబాటులోని వస్తు సేవలను ఉపయోగించుకొని అద్భుతాలను సృష్టించవచ్చునని అన్నారు. సృజనాత్మక విలువలను వస్తు సేవలకు జోడించినట్లయితే మార్కెట్లో ఉన్నత స్థాయిలో నిలదొక్కుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులు దృఢ సంకల్పం, కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయిని అధిరోహించవచ్చునని తెలిపారు. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా, ఆధునిక టెక్నాలజీలను నేర్చుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇమ్మానియేల్, ఎంసిఎ విభాగాధిపతి సి హరికిషన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సబ్జెక్టులపై పట్టు సాధించి ఎక్కువ వార్షిక వేతనంతో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఇద్దరు ఇన్విజిలేటర్లు సస్పెన్షన్

నలుగురు ఉపాధ్యాయులకు చార్జి మెమోలు

ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల జిల్లాలో పదోతరగతి ఆరో రోజు పది పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను విద్యా శాఖ శనివారం సస్పెండ్ చేసింది. మరో నలుగురు ఉపాధ్యాయు లకు చార్జి మెమోలు జారీ చేసింది. పదో తరగతి పరీక్షలను ఆరోరోజు జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు, జిల్లా అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రేపల్లె మండలం వడ్డేవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఒక ఇన్విజలేటర్ జి వినోద్ కుమార్ (ఎస్‌జిటి ఎంపీపీ పాఠశాల కామరాజుగడ్డ, రేపల్లె మండలం)ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు తెలిపారు. పరీక్షల సిఎస్‌కే వ్యవహరిస్తున్న జి మునెయ్య (ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లూరుపాలెం), డిఓసి హెచ్ నరేంద్రబాబు (ఎస్‌ఎ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిరాట్లంక)కు చార్జిమెమో జారీచేసి పరీక్ష విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. అదేవిధంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ఓపెన్ స్కూల్ పది పరీక్షా కేంద్రంలో ఇన్విజలేటరు ఆర్ పద్మ, (ఎస్‌జిటి ఎస్ కే పి మునిసిపల్ పాఠశాల)ను సస్పెండ్ చేశామన్నారు. పరీక్షల సిఎస్ కె ఫ్రాన్సిస్, (ఎస్‌ఏ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్లపాలెం) డిఇఓ డి సాంబశివరావు, (ఎస్‌ఏ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)కు చార్జిమెమో జారీ చేసి పరీక్ష విధుల నుంచి తొలగించినట్లు డిఇఓ తెలిపారు.

'మిషన్ వాత్సల్య' గడువు పెంపు

ప్రజాశక్తి-సంతమాగులూరు: మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తు తేదీని ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్లు సిడిపిఓ డి సుధ తెలిపారు. ఇప్పటివరకు సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి మండలాల ప్రాజెక్టు పరిధిలో 350 దరఖాస్తులు ఐసిడిఎస్ కార్యాలయానికి అందాయన్నారు. ఎవరైనా పిల్లలు 0 నుంచి 18 సంవత్సరాల వయసు మధ్య గల పిల్లలకు తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరు లేని పిల్లల ఆర్థికం లేదా ఇతర అనగా పిల్లల వైద్య, విద్య, మరియు అభివృద్ధి అవసరాలు తీర్చడానికి కొంత సహాయం అందించడానికి మిషన్ వాత్సల్య పేరుతో స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.

ముఖ్యమంత్రి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు

తక్షణమే అమలు: కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి బాపట్ల జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా ఆదేశించారు. జిల్లా ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. బాపట్లలో అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్య తా అంశాలను అధికారులు గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించిన సమయంలో ప్రజలకు పలు హామీలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆ హామీలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్య మంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని ఆయన హెచ్చరించారు. రాయితీలు వర్తించేలా ఆక్వా చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురావాలని మత్స్యకారులు సిఎంను కోరడంతో జిల్లాలో నూతనంగా 8,200 ఎకరాలను ఆక్వా జోన్ కిందకు తెచ్చామన్నారు. నిజాంపట్నం హార్బర్ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు లభించగా పనులు కొనసాగు తున్నాయన్నారు. నిజాంపట్నం పోర్టులో బోట్ యార్డ్ నుంచి మత్స్యకార కాలనీ వరకు రివిట్మెంట్ చేయాల్సిన ప్రక్రియ నిర్మాణ దశలో ఉందన్నారు. ధాన్యం కొనుగోలులో 20 మెట్రిక్ టన్నులు మించామని కలెక్టర్ చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో మంజూరైన పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కొమ్మమూరు కెనాల్ అభివృద్ధి కోసం రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కారంచేడులో తాగునీటి చెరువు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం మంజూరు చేస్తూ అధికారికంగా ఆమోదించిందన్నారు. పావులూరులో ఆటోనగర్ ఏర్పాటుపై స్థలం కేటాయించాల న్నారు. గుంటూరు కెనాల్ తొండివారు అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రేపల్లెలో 1,344 టిడ్కో గృహాలు త్వరగా పూర్తిచేయాలని ఎస్‌పిసిఎల్ సంస్థకు 2000లో ఒకసారి నోటీసులు ఇవ్వగా, 2022లో మరోసారి నోటీసులిచ్చామన్నారు. అయినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు. కేవలం 196 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని వివరించారు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు మండలాలలోని లంక గ్రామాలలో సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చే ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ చెప్పారు. నది పోరంబోకు భూములుగా నమోదైన ప్రాంతంలో 1994 మంది రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. భూముల సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో ఆ భూములను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వేమూరులో జగనన్న కాలనీలో ఏర్పాటులో భాగంగా 161 లేఅవుట్స్ ఉండగా 51 లేఅవుట్స్‌ను మూడడుగులకు పైగా మెరక తోలించాలని ప్రజలు కోరారన్నారు. ఇందుకోసం 158 పనులు మంజూరు కాగా, వేగంగా పనులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చే ప్రక్రియ టెండర్ దశలో ఉండగా వడిగా చేపట్టాలన్నారు. మిర్చి పంటకు బీమా పరిహారం అందేలా చూడాలన్నారు. సుబాబుల్ కర్ర కొనుగోలులో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పక్కాగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు నివాసముండే 62 గ్రామాలకు శ్మశాన భూములు లేవని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటివరకు 47 గ్రామాలకు భూమిని గుర్తించి కేటాయించే ప్రక్రియ చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు విధిగా శ్మశాన భూమి కేటాయించాలని ఆయన ఆదేశించారు. 14వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేటాయించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు భూమి కేటాయించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్, డిఆర్ఓ కె లక్ష్మీశివజ్యోతి, ప్రకాశం జడ్పి సిఇఓ బి జాలిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పసుపుమయంగా ఛందోలు

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

పిట్టలవానిపాలెం మండలం ఛందోలు గ్రామం శనివారం పసుపుమయంగా మారింది. బాపట్ల తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ప్రజల వద్దకు వెళ్లి అధికార పార్టీ వైఫల్యాలు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం ఛందోలు గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం', మీ మాట-నాబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపనూ ఆప్యాయంగా పలకరించారు. బాపట్ల అభివృద్ధికి తన ఆలోచనలను ప్రజలకు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రభాగాన నిలిపిన నారా చంద్రబాబు నాయుడు విజన్, పరిపాలన దక్షతను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో గత 8 సంవత్సరాలుగా మా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టిన విషయం ప్రజలందరికీ తెలిసిందే అని గుర్తు చేశారు. మంచినీటి ఎద్దడి ఎక్కువగా వున్న తీరప్రాంత వాసుల కష్టాలు తెలుసుకొని మంచినీటి ప్లాంట్లు పెట్టి వారికి చౌక ధరకే నేరుగా ఇంటికే మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. కష్టానికి మారుపేరైన మహిళామణులను గౌరవిస్తూ వారికి చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకొనే సంచిని, తన గురించి తెలియజేసే ఒక కరపత్రాన్ని అందించి వారి ఆశీర్వచనాలు అందుకుంటున్నట్టు నరేంద్రవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నిజాం, మీరా, యూనిట్ గ్లోరి, సైదా, అఫ్జల్, శ్రీనివాసరాజు, వెంకట్రావు, వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర

డమ్మీ గ్రూపులతో బ్యాంకు రుణాలు

మెప్మాలో అవినీతి ● ఆర్పీలు, బ్యాంకర్ల కుమ్మక్కు ● నిబంధనలకు పాతర

ప్రజాశక్తి-రేపల్లె

మహిళలను ఆర్థికంగా బలోపేతంచేసి, వారికి సామాజిక భద్రత కల్పించాలనే ఆశయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ మెప్మాలో అవినీతి రాజ్యమేలుతోంది. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరుకు పాటించాల్సిన నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి బినామీ గ్రూపుల ద్వారా ఆర్పీలు రుణాలు పొందారు. గ్రూపు ఏర్పాటులో కనీస నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. స్వయం సహాయక సంఘంగా ఏర్పాటు అయిన గ్రూపు పొదుపు పుస్తకం, తీర్మానాల పుస్తకం, సభ్యుల బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, సభ్యుల ఫోటోలు, ఫోన్ నంబర్లతో కూడిన దరఖాస్తులను ఆర్పీలు పరిశీలించి ఆన్‌లైన్ చేయాలి. తరువాత ఆరు నెలల నుంచి సంవత్సరం లోపు బ్యాంకులలో క్రమం తప్పకుండా పొదుపు చేసిన సంఘాలకు ఆర్పీలు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాల మంజూరుకు సిఫార్సు చేస్తారు. బ్యాంకర్లు గ్రూపు సభ్యుల పొదుపు ఖాతాలను, ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించి రుణాలు మంజూరు చేయాలి. ఇవేమీ పాటించకుండా ఆర్పీలు, బ్యాంకర్లు కుమ్మక్కై ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారు. మెప్మాలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా, దోచుకున్నోళ్లకు, దోచుకున్నంత అన్న చందంగా మెప్మాలో అవినీతి రాజ్యమేలుతోంది. పురపాలక సంఘం పరిధిలో మొత్తం 904 ఆన్‌లైన్ చేసిన మహిళా పొదుపు సంఘాల గ్రూపులు ఉన్నాయి. ఇవి కాకుండా ఆర్పీలు వారి సౌలభ్యం కోసం మరో 100 బినామీ గ్రూపులను ఆఫ్‌లైన్‌లో ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడ్డారని తెలుస్తోంది. గ్రూపులను ఎంపిక చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు 33 మంది ఆర్పీలు పని చేస్తున్నారు. గ్రూపుల ఏర్పాటులో ప్రాథమిక నిబంధనలు పాటించకుండా లక్షల్లో రుణాలు పొందారు. బినామీ పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించే క్రమంలో ఆర్పీలు, బ్యాంకర్లు, మెప్మా సిబ్బంది తోడుదొంగలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని నాలుగు ప్రధాన బ్యాంకులలో ఒకే పేరుతో గ్రూపులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. పురపాలక సంఘం పరిధిలోని మెప్మా విభాగంలో జరిగిన రుణాల కుంభకోణంలో అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం..

ప్రజలకు తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-టంగుటూరు

అసలే వేసవికాలం.. రోజు రోజుకు ముదురుతున్న ఎండలతో ప్రజలు సతమతవుతున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్య నెలకొన్నడంతో ప్రజలు అధికారుల వద్దకు పరుగులు తీశారు. టంగుటూరు మేజర్ పంచాయతీకి అనుసంధానంగా ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వాహకుల వ్యవహారశైలిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామతీర్థం నీరు పంచాయతీలోని కాలనీలకు సరఫరా చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ప్లాంట్ ను ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ప్లాంట్‌లో ప్యూరిఫై చేసిన మంచినీటిని బబుల్ రూ.2 లెక్కన ప్రజలకు విక్రయిస్తున్నారు. వారం రోజులుగా ప్లాంట్‌లో మిషన్ చెడి పోయిందని, మంచినీటి సరఫరాను నిలిపివేశారు. ఇది తెలియని ప్రజలు ప్రతిరోజూ ఉదయం సమయంలో వందలాది మంది వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చి నీరు లేక పోవడంతో నిరాశతో తిరిగి వెళుతున్నారు. ఇన్ని రోజులు మిషన్ రిపేరు ఏమిటని అడిగిన వారికి ప్లాంట్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు అధికారులకు ి.ర్యాదు చేశారు.



వాంటర్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇఓ

పంచాయతీ కార్యాలయం ప్రక్కన మక్కెన వెంకట కష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు బ్రాహ్మణ బజారులో సొంత వాటర్ ప్లాంట్ ఉంది. దీంతో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పంచాయతీ వాటర్ ప్లాంట్ లో ప్యూరిఫై చేసిన నీటిని సొంత ప్లాంట్‌కు ట్యాంకుల ద్వారా నీటిని తరలించి అక్కడ బబుల్ రూ.12 రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ప్లాంట్ నీటిని ట్యాంకుల ద్వారా బ్రాహ్మణ బజార్‌లోని సొంత ప్లాంట్ కు తరలించారని పంచాయతీ కార్యదర్శి జగదీష్ కు స్థానికులు ఫిర్యాదు చేశారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటుండగా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని తాగునీటిని సైతం అమ్మి సొమ్ము చేసుకోవడం ఎంతవరకు సబబు అని ప్లాంట్ నిర్వాహకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గంలోని ఓ ప్రజా ప్రతినిధి ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో కుమ్మక్కై రూ.2 ప్రజలకు ఇవ్వాల్సిన మంచినీటిని రూ.12 రూపాయలకు అమ్మి జేబులు నింపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ప్లాంట్ నీటిని ట్యాంకుల ద్వారా బయటకు తరలిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు ప్లాంట్ నిర్వాహకులను హెచ్చరించారు. వాటర్ ప్లాంట్‌ను ఇఒ జగదీష్ శనివారం సందర్శించారు. ప్లాంట్ లోని మిషన్ రిపేరుకు గురైతే తాగునీటి కోసం ప్రజలు మళ్లీ మళ్లీ ప్లాంట్ వద్దకు తిరగకుండా బయట బోర్డు పెట్టాలని సూచించారు. రిపేరు ఎప్పటికీ పూర్తవుతుందో కూడా అందరికీ తెలిసేలా బహిరంగపరచాలన్నారు. నిర్లక్ష్యపు సమాధానంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్లాంట్ నిర్వాహకులకు సూచించారు. చెడిపోయిన మిషన్‌కు వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీటిని అందించాలని ఇఒ జగదీష్ బాబు ప్లాంట్ నిర్వాహకులను ఆదేశించారు.



అధ్యక్ష, కార్యదర్శులు రాధ, మహాలక్ష్మి

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో అంగన్‌వాడీల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యక్కంటి రాధ, ముక్కు మహాలక్ష్మ్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలు అదనపు పనిభారంతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని కున్నారు. అధ్యక్ష కార్యదర్శులు రాధ, ఉక్కు మహాలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు రాయల మాలకొండయ్య, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ముక్కు మహాలక్ష్మి, తాతపూడి ప్రమీల, టి.నారాయణమ్మ, వెంకట శ్రీలక్ష్మి, రెడ్డం తిరుపతమ్మ, అనిశెట్టి నారాయణమ్మ, జి.రమాదేవి, ఝాన్సీ, స్వప్న దమ్ము పద్మావతి, పాపబత్తిన ఆదిలక్ష్మి, రాయల రమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శిలో ఇఫ్తార్ విందు


ప్రజాశక్తి-దర్శి

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు బూచేపల్లి వెంకాయమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టరు డాక్టరు ఎస్ఎం. బాషా, పాణ్యం హుస్సేన్, రంతుల్లా, మస్తాన్‌వలి, ఇమాన్ ఉల్లాఖాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం : జెవివి

ప్రజాశక్తి-చీమకుర్తి

రక్తదానం ప్రాణదానంతో సమానమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్, పూలే జయంతి వారోత్సవాల్లో శుక్ర,శనివారాలలో స్థానిక జవహర్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్, మహాత్మా పూలే స్ఫూర్తితో యువకులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.యువకులు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ చేస్తున్న కృషి ఆచరణీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పిజయ్,



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ జవహర్

ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దేవరాజ్, జిల్లా మాజీ అధ్యక్షుడు పూసపాటి వెంకటరావు,క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఆకాష్, వాసు, రామాంజి, రాజా,బి కిరణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు. రామారావు, ఆంజనేయులు, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూర్తి చిత్ర పటానికి సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వల్లభుని ఆదిమూర్తి దశదిన కర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య పాల్గొని ఆదిమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిమూర్తి భార్య రమాదేవి, కుమారుడు విద్యాసాగర్‌ను పరామర్శించారు. ఆదిమూర్తికి నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు టంగుటూరి రాము, వేసుపోగు



ఆదిమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మోజెస్, టి.రామ్మూర్తి, అత్తోట సువర్ణ రాజు,బ్రాహ్మయ్య ,పడిదపు రవికుమార్, పేముల బాబూరావు, వల్లూరు రవి, యుటిఎఫ్ నాయకుడు కొల్లూరు వెంకయ్య ఉన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

దర్శి : మండల పరిధిలోని తూర్పు వెంకటాపురంలో శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ సర్పంచి మూర్తెయ్య, కర్నాటి వెంకట నరసయ్య, పువ్వాడ సుబ్బారావు ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభను, బాశం పిచ్చయ్య, సత్యనారాయణ, చిన్న యోగయ్య, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మరో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ప్రభలపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

విద్యుత్‌చౌర్యానికి పాల్పడితే చర్యలు

విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గత ఏడాది విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 2,445 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.2.61కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. కొందరిపై కేసు నమోదు చేయగా న్యాయ స్థానంలో రూ. 47.60 లక్షల కాంపౌండింగ్ ఫీజుతో కేసును రాజీ చేసి ఎఫ్ఐఆర్ క్లోజ్ చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడిన 15 మంది సభ్యుల గల ముఠాను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.6 లక్షల రూపాయల విలువైన రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు


ప్రజాశక్తి-మర్రిపూడి

విద్యుత్ విజిలెన్స్ ఎస్ఇ అల్ఫాన్స్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు 38 బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాలలో ఏకకాలంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 16 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వారికి రూ. 86 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో దర్శి ఇఇ షేక్ కరీమ్, ఒంగోలు ఇఇ శ్రీనివాసరావు, డిఇఇ కె.శ్రీనివాసరెడ్డి, పిచ్చయ్య, గురునాథం, ఎ.శ్రీనివాసరావు, పొదిలి, దర్శి రూరల్, దొనకొండ, కొనకనమిట్ల, ముండ్లమూరు, చీమకుర్తి, మర్రిపూడి ఎఇలు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు రోటరీ క్లబ్ శింగరాయకొండ వారి ఆధ్వర్యంలో పండ్లు మిఠాయిలు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ శింగరాయకొండ అధ్యక్షుడు రంగారెడ్డి, సభ్యులు జెట్టి సూర్య చంద్రశేఖర రెడ్డి, కోశాధికారి నాగసూరి వెంకట సుబ్బారావు, కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు, అబ్దుల్ సుభాన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



గ్రామస్తులుతో మాట్లాడుతున్న తహశీల్దారు

రహదారి ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి పంచాయతీ పరిధిలోని నర్రవారి పాలెం గ్రామస్తులు ఇటీవల తహశీల్దారు కలిసి తమకు రహదారి చూపాలని విన్నవించుకున్నారు. అందులో భాగంగా తహశీల్దారు సిహెచ్.ఉషా శనివారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ కోసం నర్రావారి పాలెం వెళ్లే రహదారిపై గ్రావెల్ తోలినట్లు తెలిపారు. దీంతో రాకపోకలు సాగించేందుకు తాము అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మంచి నీటి పైపులపై కూడా గ్రావెల్ తోలడం తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. సర్వే నంబర్ 594/సి2లో వరద వెంకటేశ్వరరావుకు చెందిన మూడు సెంట్ల భూమిలో గ్రావెల్ తోటినట్లు తెలిపారు. వెంకటేశ్వరరావుకు రైల్వే, రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నష్ట పరిహారం చెల్లించకుండా గ్రావెల్ తోలినట్లు తెలిపారు. దీంతో స్పందించిన తహశీల్దారు ఉషా మాట్లాడుతూ రైల్వే అధికారులతో మాట్లాడి గ్రామానికి రహదారి చూపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఐనాబతిన రాజేష్, ఆర్ఐ తన్నీరు తిరుమలరావు, విఆర్ఒ వెంకటాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని తాతిరెడ్డి పల్లిలో గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి తాగునీరు వృథాగా పోతుంది. నీరంతా రోడ్లపైకి రావడంతో అవి బురదమయంగా మారుతున్నాయి. ఓ ప్రక్క వేసవిలో నీరు లేక అల్లాడుతుంటే మరో ప్రక్క వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని విప్పగుంట గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మండల అదనపు ప్రోగ్రామ్ అధికారి ఎస్.మాచర్ల శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాచర్ల మాట్లాడుతూ కూలీలకు రూ.272 కూలి వచ్చే విధంగా టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా మార్కింగ్ చేసి తదనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్ పని చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

దోర్నాల మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గుమ్మా పద్మజ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి పలువురు సభ్యులు హాజరు కాలేదు. దీంతో ప్రజా సమస్యలపై మాట్లాడే వారే కరువయ్యారు. సమావేశం మొక్కుబడిగా నిర్వహించారని పలువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లతాబాబు, ఎంపిడిఒ నాసరరెడ్డి, వైస్ ఎంపిపిలు దర్శనం నాగయ్య, పరుచూరి సురేఖ, దోర్నాల సర్పంచి చిత్తూరి హారిక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని నేరేడుపల్లి రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షలకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ ఇవి.రమణ మాట్లాడుతూ మట్టి నమూనా ఎలా సేకరించాలి, రైతుల సమాచారం ఎలా సేకరించాలని, సేకరించిన మట్టి నమూనాలను మండల వ్యవసాయ అధికారి ద్వారా మట్టి పరీక్ష కేంద్రానికి పంపు విధానం గురించి గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. ప్రతి 5 ఎకరాల పరిధిలో ఒక మట్టి నమూనా సేకరించాలన్నారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో అందరి రైతులకు ఉచితంగా మట్టి పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .**వెలిగండ్ల :** మండల పరిధిలోని హుస్సేన్‌పురం రైతు భరోసా కేంద్రంలో విఎఎలకు భూసార నమూనా పరీక్షలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఇవి.నారాయణ, ఎఒలు టి.శిల్ప, ఎన్.రంగకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో ప్రతి రైతు భరోసా కేంద్రం భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలను రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా మట్టినమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిఎం కిసాన్, పెండింగ్ ఇకెవైసి ఉన్న రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** మండల పరిధిలోని కాశికుంట తండా రైతు భరోసా కేంద్రం వద్ద మట్టి నమూనాల సేకరణపై గ్రామ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు నీరజ మాట్లాడుతూ గ్రామ సహాయకులకు పలు సూచనలు ఇచ్చారు. మట్టి నమూనాలను గట్ల ప్రక్కన, చెట్ల నీడలో, నీళ్ల నిలబడే చోట, గుంటల్లో మొదలైన చోట్ల తీయరాదని తెలిపారు. మట్టి నమూనాలు తప్పనిసరిగా చదరంగా ఉన్న చోటే తీయాలని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలు తీసే విధానం చూపించారు. మట్టినమూనాలు ఫలితాలను సకాలంతో రైతులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అగ్నిమాపక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండోవ రోజు శనివారం కర్నూలు రోడ్డు సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేసే సిబ్బందికి షాపింగ్ మాల్‌లలో జరిగే అగ్ని ప్రమాదాలు, గృహాలలో గ్యాస్ సిలిండర్ లీక్ కారణంగా ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎలా నివారించాలనే విషయమై ప్రదర్శన చేపట్టారు. ఆర్‌టిసి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో ప్రయానికులు, అక్కడ పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాలను నివారించే విధానంపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్. వేణు గోపాలరావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు అగ్ని మాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.**టంగుటూరు :** ప్రజలు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని టంగుటూరు అగ్నిమాపక శాఖ అధికారి ఆనం రమణారెడ్డి తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్ని ప్రమాదాలు - నివారణ చర్యలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న పలు ప్రాంతాలను గుర్తించి నిర్వాహకులకు ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక బస్ స్టాప్ సెంటర్లో దాదాపు అగ్నిమాపక సేవలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఒ రమణారెడ్డి, డిఎల్ఒపి సిహెచ్. బంగారు బాబు, లీడింగ్ ఫైర్‌మెన్‌లు సత్యనారాయణ, పాల్‌బర్నబా, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఫైర్ మెన్‌లు నాగేశ్వరరావు, కిషోర్, యేసోబు, మురళి రావు, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.



ఒంగోలులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



టంగుటూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గృహ నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి- జరుగుమల్లి

జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని చిరికూరపాడు గ్రామంలోని జగనన్న కాలనీ లేవుట్లలో నిర్మిస్తున్న గృహాలను శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గృహ నిర్మాణం 40 శాతం పూర్తి అయితే జెజెఎమ్ పథకం ద్వారా కాలనీలోని ప్రతి ఇంటికి మంచి నీటి కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణాలు నూరు శాతం పూర్తయితే సిమెంటు రోడ్లు, సైడు కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని దావగూడూరు గ్రామంలోనున్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తయారు చేసిన వర్మీ కంపోస్టును రైతులకు తక్కువ ధరకే ఇవ్వాలని సచివాలయ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, హౌసింగ్ ఎఒ అవినాష్ చిరికూరపాడు పంచాయితీ కార్యదర్శి కె. గీత, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణ

ఆర్చి నిర్మాణ విషయంలో ఉద్రిక్తత

ఇరు గ్రూపులకు సర్ది చెప్పిన పోలీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఇజ్రాయిల్ పేటలో శనివారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. కొలుకుల మెయిన్ రోడ్డు నుంచి ఇజ్రాయిల్ పేటకు వెళ్లే ఎంట్రన్స్‌లో ఇజ్రాయేలు పేట వాసులు ఇజ్రాయేలు పేట పేరుతో ఆర్చి నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా పిల్లర్లు వేసే పనిని శనివారం ప్రారంభించారు. అయితే అగ్రకులస్తులకు చెందిన కొందరు అక్కడకు వచ్చి ఆర్చి కట్టడానికి వీలులేదంటూ అభ్యంతరం తెలపడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇజ్రాయేలు పేటకు సంబంధించి గత ఇరవై ఏళ్ళ క్రితమే ఆర్చి నిర్మించేందుకు ప్రస్తుత స్థలంలోనే సమాయత్తమయ్యామని ఇజ్రాయేలు పేట వాసులు తెలిపారు. ఆ తర్వాత నిర్మాణం నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అదే స్థలంలో తిరిగి ఆర్చి నిర్మిస్తుండగా అగ్రకులస్తులు అడ్డుకున్నారు. దీంతోఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక పనులు ఆపాలని సూచించారు. ఎస్ఐ కోటయ్య పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి ఇరుగూప్రుల వారికి సర్ది చెప్పారు.



ఆందోళన చేస్తున్న ఇజ్రాయేలు పేట వాసులు

పెద్దబొమ్మలాపురంలో నీటి ఎద్దడి

పెద్ద దోర్నాల : మండల పరిధిలోని పెద్ద బొమ్మలాపురంలో నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వేసవి కావడంతో నీటి అవసరాలు పెరిగినట్లు వారు వాపోతున్నారు. అధికారులు అధికారులు నీటి ఎద్దడి నివారణకు ముందస్తు తీసుకోలేదని చెబుతున్నారు. గత్యంతరం లేక పొలాల సమీపంలోని బోర్ల వద్ద వెళ్లి నీరు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ఎద్దడిని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



వ్యవసాయ బోరు వద్ద నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

19న చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - గిద్దలూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19న గిద్దలూరులో నిర్వహిస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు పాల్గొనే కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ టిడిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ సయ్యద్ శానేశావలి, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గోపారపు గోపాల్ రెడ్డి, అధికార ప్రతినిధి షేక్ మహబూబ్ బాషా, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గుర్రం దానియేలు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి దూదేకుల దస్తగిరి పాల్గొన్నారు.

లోకేష్‌పై అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంబేద్కర్ పేరుతో నారా లోకేష్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ అసత్య ప్రచారం చేయడం తగదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనూ చంద్రబాబునాయుడిపై, లోకేష్ పై ఇలాంటి తప్పుడు ప్రచారం చేసి దొరికిపోయిన వారు వైసిపి వాళ్ళేనన్నారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోని జక్కసానిపల్లి గ్రామ ఎస్‌సిలతో లోకేష్ ముఖాముఖి నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో అంకులప్ప అనే దళితుడు అంబేడ్కర్ విదేశీ విద్యపై అడిగిన ప్రశ్నకు లోకేష్ చెప్పిన సమాధానాన్ని వక్రీకరించి దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, తోట మహేష్ నాయుడు కంచర్ల సత్యనారాయణ గౌడ్, శనగ నారాయణరెడ్డి, గురిచేపల్లి జిల్లాని, షేక్ చిన్న వలి, చెవుల అంజయ్య, శ్రీశైలపతి నాయుడు,చెన్న వీరయ్య, సేవియా నాయక్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని కాశికుంట తండాలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పాత్లావత్ వెంకటేశ్వర్లు నాయక్ కుంటుబ సభ్యులను కెకెటిఎస్‌హెచ్ ఫౌండేషన్ సభ్యులు శనివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.1000 నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్, సభ్యులు బాలు నాయక్, ఆర్ బాలూ నాయక్, ఎం బాలూ నాయక్, మంత్రూ నాయక్, అశోక్ నాయక్, శ్రీను నాయక్, వి బాలూ నాయక్, ఆర్. మంత్రూ నాయక్, దీప్లా నాయక్, ప్రేమ్‌రాజ్ నాయక్, రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.

పథకాల వినియోగంతో పేదరిక నిర్మూలన

ప్రకాశం జిల్లా జడ్జి ఎ భారతి

ప్రజాశక్తి అద్దంకి

భారతదేశంలో పేదరిక నిర్మూలన చేయాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను వినియోగించుకోవాలని ప్రకాశం జిల్లా జడ్జి ఎ భారతి అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయ భవనాలలో న్యాయసేవ శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి ఎ భారతి హాజరయ్యారు. జిల్లా జడ్జి ఏ భారతిని అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బి బాబునాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఇతర సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ముందుగా పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పేదరికం పట్టణ నిర్మూలన మెప్మా, అంగనవాడీ, తదితర శాఖలకు చెందిన సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులకు జిల్లా జడ్జి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎ భారతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అద్దంకి కోర్టు సముదాయంలో న్యాయసేవా శిబిరం కార్యక్రమాన్ని



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భారతి

ఏర్పాటు చేశారని అద్దంకి కోర్టుతో మంచి సంబంధాలు ఉన్నాయని జిల్లా జడ్జిగా నియమితులైన సందర్భంగా సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకుని బాధ్యతలు చేపట్టామన్నారు. పేదరిక నిర్మూలన సమర్థవంతంగా అమలు చేసినప్పుడే పోతుందని, పేదరికంలో లక్షలాది కుటుంబాలు మగ్గిపోతున్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలన్నారు. వయోవృద్ధులకు ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. వారిని చూసుకోవలసిన బాధ్యత బిడ్డలపై ఉందన్నారు. మన కుటుంబాలలో తాత, నాయనమ్మ కుటుంబాలు కలిసి ఉండేవని, ఏ సమస్య వచ్చినా కుటుంబమంతా కూర్చుని సమస్యను పరిష్కరించుకునేవారని అన్నారు. వయోవృద్ధులను కొడుకుతో పాటు కుమార్తెలు కూడా చూడవలసిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు మాట్లాడుతూ న్యాయం కోసం ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దాన్ని వినియోగించుకున్నట్లయితే అనేక సమస్యలకు సీనియర్ న్యాయవాదులు సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలను అర్హులైనవారు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. సీనియర్ న్యాయవాది నాదెండ్ల దశరమయ్య, పిఎల్ఎన్ ప్రసాద్, అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మురకొండ చంద్రశేఖరరావు మాట్లాడారు. న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సాగు ఖర్చు తగ్గుతుంది

ప్రజాశక్తి-అద్దంకి: భూసార పరీక్షలు ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు అని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె ధనరాజు అన్నారు. శనివారం నాగులపాడు రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులకు భూమి, ఆరోగ్యం మట్టి నమూనాల సేకరణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో మట్టి నమూనాలను చాలా జాగ్రత్తగా సేకరించాలని, మట్టినమూనాల సేకరణలో గట్ల పక్కన, చెట్ల నీడలో, పశువుల ఎరువు చల్లిన చోట, తడి మట్టి చోట నమూనాలు సేకరించరాదని తెలిపారు. పరీక్షలో నత్రజని, భాస్వరం, పొటాష్, ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రియ కర్బనశాతం ఎంతవరకు ఉన్నాయి అనేది తెలియజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఓ కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: రైతులు పొలాలను భూసార పరీక్షలు చేయించుకుని పంటలు వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్‌విపి కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వేమవరం రైతు భరోసా కేంద్రం వద్ద భూసార పరీక్షలు చేసే విధానంపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గుతుందని, ఏ పంట వేసుకుంటే దిగుబడి అధికంగా వస్తుందో తెలుస్తుందని అన్నారు. ఈ శిక్షణకు మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు పాల్గొని భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరించే విధానం, మట్టి సేకరించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షలకు పంపే విధానం గురించి వివరించారు.

మార్టూరు రూరల్: రైతులు సాగుచేయబోయే పంటలకు ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలంటే



అద్దంకిలో మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు కె ధనరాజు

మట్టి పరీక్షలు తప్పనిసరి అని మార్టూరు డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి కెవి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రం మార్టూరులోని రైతు భరోసా కేంద్రం మట్టి పరీక్షా శిక్షణావారం అనే కార్యక్రమంలో భాగంగా మట్టి నమూనా సేకరణపై ఆర్‌బికె సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ.. నేలలో సహజసిద్ధంగా అనేక పోషకాలు ఉంటాయని, రైతులు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు వాడకుండా చూడాలని, భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సకాలంలో తెలియజేయాలని ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వీరగంధం కిరణ్ కుమార్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకొని సాగు చేయబోయే పంటలకు ఎరువులు మోతాదులు నిర్ణయించటానికి భూసార పరీక్షలు ఉపయోగపడతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్ర సిబ్బందికి, భూసార పరీక్షలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం పంగులూరులో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. భూమిలో సౌడు, ఆమ్ల గుణాల స్థాయిని నిర్ధారించి సరి చేయటానికి, తద్వారా అధిక దిగుబడులు సాధించడానికి ఈ భూసార పరీక్షలు ఉపయోగపడతాయని



బల్లికురవలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పేర్కొన్నారు. పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు, ఐదు ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా చొప్పున తీయాలని సూచించారు. 10 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలని ఆయన చెప్పారు. మట్టి నమూనా తీయదలచిన చోట, నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలైన వాటిని తీసివేయాలని, పార ఉపయోగించి 'వి' ఆకారంలో ఆరు నుంచి, ఎనిమిది అంగుళాలు అంటే నాగటి చాలంత గుంట తీయాలన్నారు. పై నుంచి కింది వరకు ఒకే మందంలో పలుచని పొర వచ్చే విధంగా మట్టిని తీయాలన్నారు. అన్ని చోట్ల నుంచి సేకరించిన మట్టిని గోనెపట్ట, పాలిథిన్ పట్ట, గట్ల మీద వేసి మట్టి గడ్డలు చిదిమి, బాగా కలిపి చతురస్రాకారంగా పరచి నాలుగు సమ భాగాలుగా విభజించాలని అన్నారు. ఎదురెదురుగా ఉన్న రెండు భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని తీసివేయాలని సుబ్బారెడ్డి చెప్పారు. మరలా నాలుగు భాగాలుగా చేయాలన్నారు. ఈ విధంగా చేస్తూ అరకిలో మట్టి నమూనా మిగిలేవరకు చేయాలన్నారు. నమూనాను శుభ్రమైన గుడ్డ సంచిలో గాని, ప్లాస్టిక్ సంచిలో గాని నింపాలని సుబ్బారెడ్డి సూచించారు. సంచి లోపల రైతు పేరు, తండ్రి పేరు, గ్రామం, సర్వే నంబర్, వేయదలచిన పంట మొదలైన వివరాలతో మట్టి నమూనాను దగ్గరలో ఉన్న భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిఇసిలో సందడిగా యంగ్ తరంగ్ 2కె23

ప్రజాశక్తి-చీరాల

నూతన విద్యార్థుల కేరింతలు ఆట, పాటలు అధ్యాపకుల హితవచనాలు, సీనియర్ల ఆత్మీయ స్వాగతాలు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవాలతో యంగ్ తరంగ్ 2కె23 కార్యక్రమం చీరాల ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయనగరం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నైపుణ్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డిగ్రీ అనేది ఒక గేట్ పాస్ లాంటిదని, డిగ్రీతో పాటు నైపుణ్యాలను మెరుగుపరచుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలను సులువుగా దక్కించుకుంటారని పేర్కొన్నారు. సాంకేతిక విద్యలో చర్చించడం అనేది చాలా అవసరం అని చెప్పారు. ప్రశ్న అనేది ముఖ్యమని, అధ్యాపకులను ప్రశ్నించినప్పుడే సబ్జెక్టులో పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పుస్తకాలను క్షుణ్ణంగా చదివినప్పుడే ప్రశ్న అనేది వస్తుందన్నారు. మీ భవిష్యత్తు మీ చేతిలోనే ఉందని, విద్యను ఒక ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం లేవగానే నేను ఒక మంచి ఇంజనీర్ కావాలని, గొప్ప గొప్ప ఆవిష్కరణలు చేయాలని, దేశానికి పేరు తేవాలని సంకల్పం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికపుడు మారుతుందని, మారుతున్న పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జూనియర్లకు స్వాగతం పలుకుతూ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్ సౌజన్య, డాక్టర్ బషీర, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్ రావు, సూర్యనారాయణ, పవన్ కుమార్, ధనలక్ష్మి, ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ, విద్యార్థులు ఆచార్యులు, సహాయాచార్యులు పాల్గొన్నారు.

దళితులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళితుల భూములు కాజేసి ఇప్పుడు జై భీమ్ జై తెలుగుదేశం అనే నినాదంతో దళితులపై ప్రేమ ఒలకపోస్తున్నారని వైసిపి పర్చూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పి రాంబాబు విమర్శించారు. ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. దేవరపల్లి భూములు, నీరు- చెట్టు పేరిట అనేకమంది దళితుల భూములు స్వాహా చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు దళితులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. సభకు మండల పార్టీ కన్వీనర్ బండారు ప్రభాకర్‌రావు, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు టి బాబూరావు, చినగంజాం, ఇంకొల్లు మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు పి ప్రకాష్, గుంటూరు శ్రీనివాసరావు, గద్దల మహేష్‌బాబు, రీజనల్ కోఆర్డినేటర్ ఎం చిననాగేశ్వరరావు, ఏజర్ల సైమన్‌బాబు, బండారు జక్రయ్య, బలరాం, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో బౌద్ధ స్థూపం ఎదురుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నిర్మితమైన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఆదివారం ఉదయం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున చేతుల మీదుగా అవిష్కరిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, శ్రీకృష్ణ దేవరాయలు, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో కొందరు నాయకులు పార్టీలకు అతీతంగా కమిటీగా ఏర్పడి వీటి నిర్వహణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు పట్టుచీర అద్దంకి రాక

ప్రజాశక్తి-అద్దంకి

సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన చేనేత కళాకారుడు జి నాగరాజు 16 కేజీల బరువుగల 160 అడుగుల పట్టుచీర నేసి అయోధ్యలోని రామమందిరానికి పంపనున్నారు. మార్గమధ్యంలో అద్దంకికి తీసుకుని వస్తున్నారు. పట్టుచీరను హరిహరగోకుల క్షేత్రంలో ప్రదర్శించనున్నారు. ఈ పట్టుచీర విశేషమేమిటంటే చీరపై 168 రామాయణ ఘట్టాలను జరీతో చిత్రించారు. 13 భారతీయ భాషల్లో 32,200 శ్రీరామ నామాలు రాశారు. అరుదైన, అద్భుతమైన ఈ పట్టుచీర అద్దంకి వాసులు చూసేందుకు ఏర్పాటు చేశారు. 16వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో మెరిసే 160 అడుగుల పట్టుచీరను దర్శించే అవకాశాన్ని వినియోగించుకోవాలని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గోనుగుంట సుబ్బారావు, నాగసూరి వెంకట సుబ్బారావు, పసుమర్తి రామారావు, చుండూరి మురళీసుధాకరరావు, అమర్నేని శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, నవయుగ స్వీట్స్ వెంగళరావు, మంగమూరి సురేష్ పోకూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

విద్యార్థినులకు శిక్షణలు దోహదపడతాయి

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థినులకు పలు రకాల శిక్షణలు దోహదపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రమణమ్మ పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాలో జనవరి 20వ తేదీ నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శనివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థినుల కోసం నెహ్రూ యువ కేంద్రం వారు ఇస్తున్న శిక్షణలు అభినందనీయమని అన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు భాగ్యలక్ష్మి, శిక్షకులు భారతీదేవి, నాగరాజు, ఎన్‌వైకేఎస్ వాలంటీర్ ఎన్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పల్నాడు జిల్లా ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లజత 4,306 అడుగులు లాగి మొదటి బహుతి గెలుచుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన విజయభాస్కరరెడ్డి ఎడ్లజత 4,104.04 అడుగులు లాగి ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ప్రకాశం జిల్లా కాటంవారిపల్లెకు కెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 4,081 అడుగులు లాగి మూడవ బహుమతిని గెలుచుకుంది. ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన గొట్టం ప్రణీత్‌రెడ్డి ఎడ్లజత 3,421 అడుగులు నాల్గవ స్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా బురుజుపల్లి గ్రామానికి చెందిన ఎర్రమల సోమిరెడ్డి ఎడ్లజత 3,365.06 అడుగులు లాటి ఐదో స్థానంలో నిలిచాయి. విజేత ఎడ్ల జతల యజ మానులకు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్. అంజమ్మ శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

భూసేకరణ వేగవంతం : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. ఒంగోలు శివారు ప్రాంతాలలో ఇళ్ల కేటాయించడం కోసం గుర్తించిన ఎస్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగ ముక్కపాలెం, యర్రజర్ల లోని ప్రతిపాదిత భూములను రెవెన్యూ అధికారులతో కలిసి జేసీ శనివారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులు కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అప్రోచ్, అంతర్గత రహదారులు, పార్కింగ్ వంటి సదుపాయాలతో కూడిన సమగ్ర లేఅవుట్లను రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఒడా వైస్ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మురళి, ఇతర అధికారులు ఉన్నారు..



అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

జాషువా పురస్కారానికి పిల్లి హజరత్తయ్య ఎంపిక



శింగరాయకొండ : శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యుడు, కవి పిల్లి హజరత్తయ్య మహా కవి గుర్రం జాషువా పురస్కారం -2023కు ఎంపికయ్యాడు. పద్మ భూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ వ్యవస్థాపకులు శ్డాక్టర్ పెద్దీటి. యోహాను హజరత్తయ్యను మహాకవి గుర్రం జాషువా పురస్కారానికి ఎంపిక చేసినట్లు లేఖ ద్వారా తెలియజేశారు. సాహితీ రంగంలో 500కు పైగా కవితలు, ఇటీవల లివెలుగు దివ్వెలు కవితా సంపుటిని రచించినందుకు గానూ హజరత్తయ్య సాహితీ సేవలకు గుర్తింపు జాషువా పురస్కారానికి (సాహిత్య భూషణ్) ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న తెనాలిలో నిర్వహిస్తున్న కళాపరిషత్ 35వ వార్షికోత్సవ వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా హాజరత్తయ్యకు పురస్కారాన్ని అందజేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దీటి యెహాను తెలిపారు.

నగరం చెత్త చెత్తగా ఉంది..

- ఒఎంసి మేస్త్రీలు, సచివాలయ సిబ్బందిపై మేయర్ ఆగ్రహం

- ప్లాస్టిక్‌ను నివారించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

'ఎక్కడికి వెళ్లినా నగరం చెత్త చెత్తగా కనిపిస్తోంది. పారిశుధ్యం నిర్వహణపై ఫిర్యాదులు పెరిగాయి. 500 మంది కార్మికులు పనిచేస్తున్నప్పుడే నగరం ఎంతో అందంగా ఉండేది. ఇప్పుడు వెయ్యి మంది పనిచేస్తున్నా ఆశించిన మేర పారిశుధ్య పనులు జరగడం లేదు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ ర్యాంకుల్లో మనం ఎక్కడో ఉన్నాం. మీరంతా ఏం చేస్తున్నారు...?' అని నగర మేయర్ గంగాడ సుజాత కార్పొరేషన్ పారిశుధ్య విభాగం మేస్త్రీలు, సచివాలయ పారిశుధ్య పర్యవేక్షకుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేస్త్రీలు, సచివాలయ పారిశుధ్య పర్యవేక్షకులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేయర్ పై విధంగా స్పందించారు. పారిశుధ్య విభాగం పనితీరు బాగా లేదంటూ పదే పదే అసంతృప్తి వ్యక్తం చేశారు. పనిచేయకుండా ఎక్కువ మంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసి పంపారని, రెండేళ్లుగా నెత్తీ, నోరు బాధుకున్నా ఒంగోలులో ఇది అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లర దుకాణాలు, మార్కెట్‌లు, వ్యాపార సముదాయాలు, తోపుడు బండ్లు.ఇలా ప్రతిచోటా ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం దెబ్బతిని, భావితరాలు ఎంతో ఇబ్బందుల్లోకి నెట్టబెడతాయని పదే పదే చెబుతున్నా....ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ నిలదీశారు. ప్లాస్టిక్ విక్రయించే వారికి ముందు చెప్పండి, తరువాత ఫైన్ వేయండి, అప్పుడు కూడా మారకపోతే దుకాణాలు మూసేయాలని దేశించారు. పారిశుధ్య కార్మికులు ఎక్కుమంది చదువులేని వారు ఉన్నారని, వారికి అర్ధమయ్యేలా చెప్పి వారిచేత పనిచేయించాల్సిన బాధ్యత మేస్త్రీలు, సచివాలయ సిబ్బందిపై ఉందని గుర్తు చేశారు. పారిశుధ్యం నిర్వహణలో మంచి ఫలితాలు కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధం పట్ల సీరియస్‌గా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాజ్జీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

పాలక సిగపట్లు

పాలకుల సిగపట్లు ప్రజలకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. పాలనలో వారి డొల్లతనం తేటతెల్లమవుతోంది. యంత్రాంగాన్ని సరైన దిశలో నడిపించే ఎజండా ఎలా ఉందో విస్పష్టంగా తెలుస్తోంది. సిఎం జగన్ పర్యటనలో సీనియర్ నేత బాలినేనికి అవమానం పెద్ద దుమారం రేగుతోంది. ఇప్పటికీ ఆయన అసంతృప్తిగానే ఉన్నారు. దీనికి ఎవరు కారణం? ఎక్కడ లోపం జరిగిందనేదాని కన్నా ముందు పాలకపక్షం పనితీరుకు అద్దం పడుతోంది. యంత్రాంగానికి,(పజాప్రతినిధులకు మధ్య ఉన్న అంతరాలను ఆవిష్కరించింది. బాలినేని ఒంగోలు సమీపానికి వచ్చే వరకూ సాగిన వ్యవహారాలు పాలకపక్షంలోనే చర్చకు దారితీస్తున్నాయి. యంత్రాంగం విధుల నిర్వహణలో అరమరికలు తెరపైకి వచ్చాయి. సమన్వయ లోపాలు చోటు చేసుకున్నాయి. పాలకపక్ష నేతల మధ్య కూడా విభేదాలు ఈ ఘటనతో మరింత ముదిరాయి. బాలినేని కూడా ఈ ఘటనపై ఘాటుగానే స్పందించారు. ఇరవైఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలు చేశానని, అనవసర వ్యవహారాలు చేస్తే ఎంతటి వారినైనా ఎదిరిస్తానని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు ఎవరినుద్దేశించినవనేదీ పార్టీలో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. నిన్నటి వరకూ అన్నీ తానై పాలన సాగించిన బాలినేనిపట్ల పోలీసులు వ్యవహరించిన తీరు మొత్తం పార్టీలోనే దుమారం రేపుతోంది. కొందరు సంబరపడినా ఆయన సన్నిహితులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. విధులు నిర్వహణలో పోలీసుల ఓవర్‌యాక్షన్ ఇక్కడ స్పష్టంగా ఉంది. సాధారణ సమయాల్లో వ్యవహరిస్తున్న తీరుకూ..సిఎం పర్యటనల్లో విధుల నిర్వహణలో తేడాలు కనిపి స్తున్నాయి. ఎప్పుడూ ఒకేలా ఉండాలా? లేదా? అన్నదీ తేలాల్సిన అంశం. మంత్రి కారును అనుమతించి...తన కారును అడ్డుకోవడంపైనే బాలినేని మండిపడుతున్నారు. ఏదేమైనా సిఎం జగన్ దృష్టి సారించాకే మళ్లీ నాటకీయ పరిణామాల మధ్య బాలినేని ఆఖరు నిమిషంలో వేదిక ఎక్కారు. ఆయనతోనే బటన్ నొక్కించడం కొసమెరుపుగా ఉంది. ఇక సిఎం పర్యటన ఉద్దేశం పెద్ద చర్చ లేకుండా పోయింది. 50 నిమిషాలు పాటు సిఎం చేసిన ప్రసంగం కన్నా బాలినేని వ్యవహారమే పెద్ద చర్చకు తావిచ్చింది. వెలుగొండ ప్రాజెక్టును అక్టోబరులో ప్రారంభిస్తామని చెప్పారు. నిర్వాసితులను వదిలేశారు. మార్కాపురం జిల్లాపై నినాదాలు వచ్చినా మౌనంగా వదిలేశారు. సిఎం పర్యటన పాలకపక్ష నేతల మధ్య విభేదాలు, అసంతృప్తులకు మరింత ఆజ్యం పోసింది. హెలిప్యాడ్ వద్ద కనిగిరి నియోజకవర్గ ద్వితీయశ్రేణి నేతలు ఎమ్మెల్యేపై పిర్యాదులు చేశారు. పార్టీలో లొసుగులూ సిఎం పర్యటనలో బయటపడ్డాయి.

– అంబేద్కర్ జయంతి వేడుకలు గతం కన్నా ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీలు,ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు జయంత్రి వేడుకలు నిర్వహించారు.అంబేద్కర్ ఆశయాలను కొందరు చెప్పగా...చిన్నతనంలో ఆయన ఎదుర్కొన్న సవాళ్లను, వివక్షతలను కొందరు నేతలు గుర్తుచేశారు. అంబేద్కర్ ఆశయాలను నిజంగా ఎంత మంది గుర్తిస్తున్నారు? ఆయన ఎజండా నిజంగా అమలు జరుగుతోందా? ఆయన ఆశించిన సామాజిక న్యాయం ఎలా ఉందనేదీ అందరూ ఆలోచించాలి. ఇప్పటికీ దళితవాడల్లో కనీస సౌకర్యాలు ఎలా ఉన్నాయి? విద్య, వైద్యం,. పీడిత సామాజిక వర్గాలకు ఎలా అందుతుంది?అనేదీ పరిశీలన చేయాలి. జిల్లాలో ఇప్పటికీ 350 దళితవాడలకు స్మశాన వాటికలు లేవు.దీన్ని ఎవరూ గుర్తించరు. జయంతి, వర్ధంతి కార్యక్రమాలు రోజునే ఇలాంటి మహానుభావులు గుర్తుకు రావడం బాధాకరం. మళ్లీ అంబేద్కర్ ఏడాదికే గుర్తుకు వచ్చేది. ఓటు బ్యాంకు రాజకీయాలకూ ఎంతటి మేధావులనైనా వాడుకుంటారు. ఇపుడూ ఇదే జరుగుతోంది. అంబేద్కర్ ఆశయాలు నిజంగా నెరవేర్చడమంటే పీడిత వర్గాలను అన్ని రకాలుగా రాజకీయంగానూ, ఆర్ధికంగానూ సామాజికంగానూ అభివృద్ధి చేయడమే. అది జరిగిన నాడే ఆయన ఆశయం నెరవేరినట్లవుతుంది.

– బిజెపి ప్రమాదకరమైన విధానాలపై వామపక్షాలు ప్రచారోద్యమాన్ని చేపట్టాయి. సిపిఎం, సిపిఐ సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రచారోద్యమంలో బిజెపి విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవడమే కీలక ఎజండా. రాష్ట్రానికి బిజెపి అన్ని రకాలుగా అన్యాయం చేసిందని వామపక్షాల నేతలు ధ్వజమెత్తుతున్నారు. ప్రత్యేకహోదాతోపాటు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేర్చలేదు. జిల్లా వెనుకబాటును గుర్తించాలని అసెంబ్లీలోనూ తీర్మానం చేశారు. దీన్ని పక్కనపడేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అందరూ వ్యతిరేకిస్తున్నా ముందుకు పోతున్నారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా కేంద్రం అన్యాయం చేసినా వైసిపి, టిడిపి బిజెపిపై పోరాటం చేయడం లేదు. నిత్యం పెట్రోలు గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు జిఎస్‌టీల బాదుడు మాత్రం ఆగలేదు. పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ధరలు పెంచి భారాలు వేస్తున్నారు. ఈ అంశాలన్నిటినీ వామపక్ష నేతలు ప్రచారంలో ప్రస్తా విస్తున్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రంపై పోరాటానికి వామపక్షాలు పిలుపు నిస్తున్నాయి. ప్రజల్లోనూ బిజెపిపై భ్రమలు పోయాయి. కేంద్రంపై ప్రజల్లో రోజురోజుకూ అసంతృప్తి పెరుగుతోంది.

– ఎండలు మండుతున్నాయి. వేసవితాపం పెరిగింది. జిల్లాలో అత్యధికంగా 42.27 డిగ్రీల ఉష్ణోగ్రత మద్దిపాడు మండలంలో రెండు రోజుల క్రితం నమోదైంది. పశ్చిమాన ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. తాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. జిల్లాలో వేసవి సమస్యలపై యంత్రాంగం కూడా దృష్టి సారించాలి. వేసవిలో ప్రజలు,పశువులకు తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలి. నీటి సరఫరావిభాగం, అగ్నిమాపక కేంద్రాలు, వైద్యశాలలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.